

ఇన్‌చార్జి మంత్రి ఉన్నట్టా..?లేనట్టా..?



- అడపాదడపా దర్శనం
- నెలలు గడిచినా జిల్లాకే రాని వైనం
- సఖ్యత లేని ఉమ్మడి జిల్లా మంత్రులు
- కాంగ్రెస్ శ్రేణుల్లో నైరాశ్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో నిత్య చైతన్యంగా ఉండే కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు, శ్రేణులు నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంతకు ఇక్కడ తమ పార్టీ అధికారంలోనే ఉందా.. ఇన్‌చార్జి మంత్రి ఉన్నట్టా.. లేనట్టా.. ఉంటే నెలలు గడిచినా ఆయన జిల్లాకు ఎందుకు రాడు, జిల్లా కేంద్రానికి కీలకంగా ఉండే కరీంనగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు మంజూరు కావడం లేదు.. అసలు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలే ఎందుకు ఏర్పాటు కావడం లేదు అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు.

● నియోజకవర్గంలో ఆధిపత్య పోరు

కరీంనగర్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితి ఆయనకు మింగుడు పడడం లేదని తెలుస్తున్నది. కరీంనగర్ నియోజకవర్గ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్య పోరుగా మారుతున్నాయనే అభిప్రాయం ఉన్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో కరీం నగర్ అసెంబ్లీకి, పార్లమెంట్ స్థానానికి పోటీచేసి ఒకసారి ఎంపీగా గెలు పొందారు. ఆయన ఈ అసెంబ్లీ నియోజక వర్గాన్ని వదిలి హుస్నాబాద్ నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాలో ఉన్నా దాని పరిధిలోని రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఆయన కరీంనగర్‌కు చెందిన వారు. ఇక్కడి రాజకీయాలతో బలమైన సంబంధాలు ఉన్నారు. ఈ జిల్లా నుంచి మంత్రిగా వేరెవరికి అవకాశం కల్పించక పోవడంతో తాను ఆ బాధ్యతను నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తూ అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. ఆయనకు సంబంధం లేకుండానే సుడా చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లేశంను నియమించారు. వీరిద్దరూ ఒకరు మంత్రి శ్రీధర్‌బాబు వర్గానికి చెందినవారుకాగా, మరొకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు. వీరిద్దరిని పదవీ బాధ్యతలు చేపట్టే విషయంలో కూడా మంత్రి పొన్నం ససేమిరా అన్నా వారు ఆయా చైర్లలో కూర్చు న్నారు. మరోవైపు తాను సపోర్టు చేసిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ తనకు ఎదురు తిరిగి వైరివర్గంలో చేరడం కూడా పొన్నం ప్రభాకర్‌కు

(మిగతా 8వ పేజీలో)

● జిల్లాకు వచ్చిందే మూడుసార్లు

ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏడాదిన్నర కాలంలో మూడుసార్లు మాత్రమే జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాల అమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష కోసం ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా ముగిసింది. అధికార, ప్రతి పక్షాల ఎమ్మెల్యేలు ఒకరినొకరు తోసేసుకునే పరిస్థితి వరకు వెళ్లింది. కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మైక్ ఇవ్వవద్దని, ఆయన ఏ పార్టీనో చెప్పాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అడ్డుకుని ప్రశ్నించడమే కాకుండా ఆయనపై దాడి చేసినంత పనిచేశారు. అదే స్థాయిలో సంజయ్ కుమార్ కూడా తీవ్ర పదజాలంతో జవాబిచ్చారు. పోలీసులు కౌశిక్‌రెడ్డిని బయటకు పంపించాల్సి వచ్చింది. దీని తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డి మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధి కార్యక్రమాల సమీక్షను నిర్వహించలేదు. హుజూరా బాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సోదరుని వరుస కావడంతో సమావేశంలో జరిగిన వ్యవహారంతో ఆయన తీవ్ర అసంతృప్తికి, అసహనానికి గురై ఆ తర్వాత సమా వేశం ఏర్పాటుకే ఆసక్తి చూపించలేదనే అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉంది.

● ఏడాదిన్నరగా ఒక్కటే సమీక్షా సమావేశం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. ఏడాదిన్నర గడిచినా ఆయన ఒకే ఒక సమీక్షా సమావేశంతో సరిపెట్టుకున్నారు. ఆ సమావేశం కూడా రసాభా సాగా మారడంతో మళ్లీ ఆయన జిల్లాలో సమావేశం ఏర్పాటుకే ముందుకు రావడం లేదు అనే మాట వినిపిస్తున్నది. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రు లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరో మరేమోగాని సఖ్యత లేకుండా పోయింది. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరుంటే ఒకరు రారు. వీరిద్దరిలో ఎవరి వద్దకు వెళ్లాలన్నా ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఎవరి వద్దకు వెళితే వారి ముద్ర పడిపోతుందేమోననే భయంతో కార్యకర్తలు ఎటూ వెళ్లలేకపోతున్నారు.

మావోయిస్టు అధినేతను చంపితే నక్సలిజం పోతుందా..

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

సుభాష్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావును తుదముట్టించడం ద్వారా నక్సలిజం పోతుందని బీజేపీ ప్రభుత్వం భ్రమపడడం దురదృష్టకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తుందని విమర్శించారు. నక్సలిజం మూలాలను చర్చించి పరిష్కరించకుండా ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం సరికాదన్నారు. దీనిపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభల్లో భవిష్యత్ పోరాటాలను రూపొందించుకుంటాన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో నగరంలోని మధు గార్డెన్‌లో నిర్వహించే 23వ మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, టేకుమల్ల సమ్మయ్య, ఏఐఎస్‌ఎఫ్ కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సిజేరియన్లతో అనారోగ్య సమస్యలు

సుభాష్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): సిజేరియన్ ఆపరేషన్ల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, ఈ విషయాలను గర్భిణులు, వారి కుటుంబసభ్యులకు తెలియజేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. సోమవారం మహిళా సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేలా చూడాలని సూచించారు. గైనకాలజిస్టుతో గర్భిణుకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటికి పూర్తి చికిత్సను అందించి, సాధారణ ప్రసవం కోసం ప్రోత్సహించాలన్నారు. అనంతరం డీటీపీవో డాక్టర్ ఉమాశ్రీ మాట్లాడుతూ కౌమారదశలో ఉన్న పిల్లలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ సాజిదా, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనాజవేరియా, డీఎంవో డాక్టర్ శైలేంద్ర, డీపీహెచ్‌ఎన్‌వో విమల పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి



జెండా ఊపి రథాలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్

కరీంనగర్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ అన్నారు. జిల్లాలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు బంగారు రైతు రథాలను సోమవారం గంగాధరలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్లు కష్టపడితే 30 సంవత్సరాల పాటు రైతులకు నికర ఆదాయం వస్తుందని అన్నారు. లోహియా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్‌సాగుపై జిల్లాలో నెలరోజుల పాటు విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. లోహియా కంపెనీ సీఈవో సిద్ధాంత్ లోహియా మాట్లాడుతూ జిల్లాలో విలేజ్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామానికి ఈ రథాలు వెళ్లి సదస్సులు నిర్వహిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ సంస్థ నిర్వాహకులు ప్రతిక్ పట్నాయక్, ఐలయ్య, రోహిత్, మంజువాణి, రవళి, లోహియా సంస్థ జిల్లా మేనేజర్ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

జమ్మికుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను సీపీ సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడి శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జమ్మికుంట రైల్వే స్టేషన్, గాంధీ చౌరస్తా తదితర ముఖ్యమైన రద్దీ ప్రాంతాలను సందర్శించారు. రద్దీ ప్రాంతాల్లో ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సీపీ గౌస్ అలం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఎస్‌ఐ తోట తిరుపతి, ప్రొబేషనరీ ఎస్‌ఐ సాయికృష్ణ, ఏఎస్‌ఐ రవి పాల్గొన్నారు.

ప్రవేశాల పెంపే లక్ష్యంగా బడిబాట

● 6 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

కరీంనగర్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా బడిబాట నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాల్లో బోధన, వసతులపై అవగాహన కల్పించారు. ఈ నెల 30న మండలాల్లో, గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో మరో సారి సమావేశం కానున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినం సందర్భంగా పతాకావిష్కరణ అనంతరం ఉపాధ్యాయులు గ్రామస్థులను చైతన్యం చేయనున్నారు.

● కార్యక్రమాల నిర్వహణ ఇలా..

జూన్ 6న గ్రామసభలు నిర్వహించాలి. పాఠశాలల్లో సౌకర్యాలు, అవగాహన కల్పించాలి. 7న ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లల వివరాలు సేకరించాలి. 8 నుంచి 10 వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టర్లను అతికించాలి. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలి. పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలిరు.

● సమీక్ష.. సవరణ....

6 నుంచి 10వ తేదీ వరకు చేపట్టిన కార్యక్ర మాలను సమీక్షిస్తారు. అనంతరం 12వ తేదీన అమ్మ ఆదర్శ బడుల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రారంభిస్తారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తారు. 13న సామూహిక అక్షరాభ్యాసాలు, 16న ఎఫ్‌ఎల్‌ఎన్‌పై సమీక్ష, 17న విలీన విద్య, బాలిక విద్యాదినోత్సవం నిర్వహిస్తారు. 18న తరగతి గదుల ఆధునికీరణ చేపట్టనున్నారు. సాంకేతిక విద్య, వసతుల కల్పనపై అవగాహన కల్పిస్తారు. 19న బడిబాట కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తారు.

సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం నగరపాలసంస్థ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా అందించిన అప్లికేషన్లు సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని అన్నారు. సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ పూర్తి చేసిన బ్యాంకులు తిరిగి నగరపాలక సంస్థకు అప్లికేషన్లతోపాటు దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ వివరాలను అందించాలని సూచించారు. బ్యాంకు అధికారులు దరఖాస్తుదారులకు లోన్స్ యూనిట్స్ కేటాయిస్తామని చెప్పడం, హామీలు ఇవ్వడం లాంటివి చేయకూడదని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, మెప్మా పీడీ వేణుమాధవ్‌రెడ్డి, టీఎంసీ మానస పాల్గొన్నారు.

● పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో 10 నుంచి అమ్మకాలు ప్రారంభించాలి...

పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో వ్యాపారులు జూన్ 10 నుంచి అమ్మకాలను ప్రారంభించాలని కమిషనర్ చాహత్‌బాజ్ పాయ్ అన్నారు. సోమవారం కళాభారతిలో పద్మనగర్ సమీకృత మార్కెట్ షాపులు పొందిన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో వ్యాపారులు తమ తమ షాపుల్లో వ్యాపారం ప్రారంభించాలని ఆదేశించారు. షాపులు పొందినవారు వెంటనే నగరపాలక సంస్థ నిబంధనల ప్రకారం అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో భూమానందం, ఆర్‌ఐ కిష్టయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి
● ప్రమాదకరంగా గుంతలు
7

ప్రజావాణికి 335 దరఖాస్తులు

సుభాష్‌నగర్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 335 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

● లైసెన్స్‌డ్ సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను సోమవారం నిర్వహించారు. నగరంలోని ఐటీపార్కు సమీపంలోగల బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, ఆర్డీవో మహేశ్వర్‌లు పరిశీలించారు. 300 మంది సర్వేయర్లు దరఖాస్తు చేసుకోగా 280 మందికి సంబంధించిన సర్టిఫికెట్స్ పరిశీలన పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ మాట్లాడుతూ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులకు ఐటీ కార్యాలయంతోపాటు జడ్పీ కార్యాలయంలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

పెరిగిన పత్తి విత్తనాల ధరలు

- ఒక్కో ప్యాకెట్‌పై రూ. 37 పెంపు
- డివిజన్‌లో 20వేల ఎకరాల్లో పత్తి సాగు
- 30వేల పత్తి ప్యాకెట్లు అవసరం



హుజూరాబాద్‌లో పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్న మహిళా రైతులు

హుజూరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా చీడ పీడల బెడదతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. మార్కెట్లో పత్తికి ధర ఏడువేలకు మించి పలకకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. పంట దిగుబడి సరిగా రాలేదు. అసలే ఇబ్బందుల్లో ఉన్న పత్తి రైతులపై కేంద్ర ప్రభుత్వం అదనపు భారం మోపింది. ఈసారి పత్తి వ విత్తనాల ధర ప్యాకెట్‌కు 37 రూపాయలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. హుజూరాబాద్ డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, వీణవంక, ఇల్లందకుంట, శంకరపట్నం, సైదాపూర్ మండలాలు ఉన్నాయి. 1.2 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, అందులో 20వేల ఎకరాల్లో బీటీ-2 పత్తి సాగు చేస్తారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం కంటే ఒక్కో ప్యాకెట్‌పై 37 రూపాయల ధర పెంచింది. 2024 సంవత్సరంలో బీటీ-2 పత్తి విత్తనానికి ఒక ప్యాకెట్‌కు 864 ధర ఉండగా, ప్రస్తుతం 37 రూపాయలు పెంచి 901 రూపాయలుగా నిర్ణయించింది. డివిజన్‌లో 20 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుండగా, ఒక ఎకరాకు రెండు పత్తి ప్యాకెట్లు అవసరమవుతాయి. విత్తనాలు పెట్టిన తర్వాత వర్షాలు సమృద్ధిగా కురిస్తే 65 శాతం మాత్రమే మొలకెత్తుతాయి. మళ్లీ పోగుంటలకు పత్తి గింజలు అవసరం ఉంటాయి. మొత్తం 30వేల పత్తి ప్యాకెట్లు హుజూరాబాద్ డివిజన్‌కు అవసరమవుతాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు దుకులు దున్ని భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

2018 నుంచి బీటీ-2 పత్తి విత్తనాల ధరలు

సంవత్సరం	ధర (ప్యాకెట్‌కు)
2018	రూ. 690
2019	రూ. 710
2020	రూ. 730
2021	రూ. 767
2022	రూ. 810
2023	రూ. 853
2024	రూ. 864
2025	రూ. 901

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

- సునీత, ఏడీఏ, హుజూరాబాద్



రైతులు పత్తి విత్తనాలను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయకుండా లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. రసీదును జాగ్రత్తగా దాచుకోవాలి. బీటీ-2 పత్తి విత్తనాలు హుజూరాబాద్ డివిజన్‌లో అందుబాటులో ఉన్నాయి. మొదటి వర్షానికే రైతులు విత్తనాలు విత్తి నష్టపోవద్దు. అదును చూసి పత్తి విత్తనాలు వేసుకోవాలి.

రామగుండం సీపీ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ అకౌంట్లు

కోల్‌సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులపేర సైబర్ నేరగాళ్ల ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో వారి ఫొటోలను వాడి నకిలీ అకౌంట్లు క్రియేట్ చేశారు. ఈ ప్రాంతంలోని పలువురు ప్రముఖులకు ఫ్రెండ్స్ రెక్వెస్టలను పంపిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల అకౌంట్ కదా అని అక్సెప్ట్ చేస్తే సదరు అధికారి పేర చాటింగ్ చేస్తు న్నారు. ఫలానా అధికారి బంధువులు, మిత్రులు ఆర్మీలో అధికారులుగా పనిచేస్తు న్నారని, వారు బదిలీకావడం వల్ల తక్కువ ధరకు సామగ్రి అమ్ముతున్నారని, కొనుక్కోవాలని, డబ్బులు పంపాలంటూ సూచిస్తున్నారు. అలాగే పుట్టిన రోజు సందర్భంగా బహుమతులు పంపించే విధంగా చాట్‌చేయడం, పోలీస్ అధికారులే చాట్ చేస్తున్నట్లు నమ్మిస్తున్నారు. దీనిపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా స్పందించారు. ఇలాంటి వాటిపట్ల స్పందించవద్దని, డబ్బులు పంపవద్దని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల రోజురోజుకు పేట్రేగిపోతున్నారని, గతంలో సామాన్యులనే లక్ష్యంగా చేసుకున్న నేరగాళ్ల ఇప్పుడు, ప్రముఖులు, పోలీస్ అధికారుల పేర నకిలీఅకౌంట్లు తెరిచివారే చాట్‌చేస్తున్నట్టు నమ్మిస్తున్నారన్నారు. నానారకాలుగా చాటింగ్ చేస్తున్నారన్నారు. పోలీసులెవరూ ఫ్రెండ్స్ రెక్వెస్టలు పంపరని, అక్సెప్టలు చేయరని పేర్కొన్నారు.

గుంటిమడుగు ఎత్తిపోతలకు మోక్షమెప్పుడు?

- మానేరు, హుస్సేన్‌మియావాగు కలిసేచోట ప్రతిపాదన
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

కాల్వశ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల రైతులు ప్రధానంగా ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడతారు. ఈ ప్రాంతానికి ఎస్సారెస్పీ చివరి భూములు కావడంతో సాగునీటి సరఫరా సక్ర మంగా జరగడం లేదు. దీంతో వేసవిలో సాగు నీటి కోసం అన్నదాతలు నానాతంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు మానేరు, హుస్సేన్‌మియావాగు కలిసే చోట పెద్దరాతుపల్లి శివారు గుంటి మడుగు ప్రాంతంలో ప్రాజెక్ట్ నిర్మించాలని బీఆర్ ఎస్ హయాంలో ప్రతిపాదించారు. గంగారం గ్రామపరిధి ఊషన్నపల్లెకు చెందిన ఐడీసీ మాజీ చైర్మన్‌గా ఉన్న ఈద శంకర్‌రెడ్డి అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి రైతుల సమస్యలు తీసుకెళ్ళారు. కేసీఆర్ హామీతో 2019లో గుంటిమడుగు ఎత్తిపోతల పథకానికి సర్వే కూడా చేయించారు. అప్పటి కలెక్టర్ అలుగు వర్షిణి ప్రాజెక్టు ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకొని గంటి మడుగు ఎత్తిపోతల పథకం అవసరమని కలెక్టర్ ధ్రువీకరించారు. సుమారు 450కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేశారు. రిజర్వాయర్‌తోపాటు మానేరులో కిష్టం పేట వరకు, హుస్సేన్‌మియావాగు చుట్టూ కాల్వశ్రీరాంపూర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర కరకట్టలు నిర్మించి సాగునీటిని నిల్వచేసేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో మానేరు, హుస్సేన్ మియా వాగులో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర నీరు నిల్వ ఉండి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని, నిల్వ ఉన్న నీటిని మంథని ప్రాంత రైతాంగానికి కూడా ఇచ్చేందుకు ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. సుమారు 50వేల ఎకరాలకు రెండు కాలాల పంటలకు సాగునీరు అందుతుందని అంచనా వేశారు. ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి సుమారు కోటిరూపాయల నిధులతో వ్యాప్కో కంపనీతో సర్వే కూడా చేయించారు. సుమారు మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించేందుకు అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి అందజేశారు.

ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని హుస్సేన్‌మియావాగు, మానేరు ప్రాంత రైతులు ఆశపడ్డారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. గుంటిమడుగు ఎత్తిపోతల పథకం వలన భూపాలపెల్లి జిల్లా టేకుమట్ల మండలం మానేరు పరివాహక ప్రాంత గ్రామాలతో పాటు, మండలంలోని పెద్దరాత్‌పల్లి, కాల్వ శ్రీరాంపూర్, చిన్నరాత్‌పల్లి, మొట్లపల్లి, కిష్టం పేట, మీర్జం పేటతోపాటు ముత్తారం మండలం లోని పలు గ్రామాల రైతులకు ప్రాజెక్టు ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో హుస్సేనిమియా వాగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోతుంటాయి. దీంతో సాగునీరు అందక పంటలను పశువుల మేతకు ఉపయోగించిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువలపై ఆధారపడకుండా గుంటిమడుగు వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టు నిర్మించే గుంటిమడుగు ప్రాంతం

రెండు పంటలకు సాగునీరు

రైతు రావిసెట్టి సారయ్య(పెద్దరాత్‌పల్లి)



గుంటిమడుగు ఎత్తిపోతల పథకం వలన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రెండు పంటలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం సాగు నీరు అందక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం

రైతు కారుపాకలక్ష్మణ(కాల్వశ్రీరాంపూర్)



ఎస్సారెస్పీ కాలువ చివరి ప్రాంతంలో భూములు ఉండడం వలన సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం. గుంటిమడుగు రిజర్వాయర్‌తో ఈ ప్రాంత భూములు సస్యశ్యామలవుతాయి. వేసవి వచ్చిందంటే సాగునీరు అందక అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు నిర్మించాలి

భూ కబ్జా బెదిరింపులపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలం సుందరగిరిలో రమేష్ అనేవ్యక్తి తనభూమి కబ్జా చేసేందుకు బెదిరిస్తున్నాడని అదే గ్రామానికి శ్రీమూర్తి రాజు సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశాడు. రమేష్ బెదిరింపులతో తమ కుటుంబం భయాందోళనకు గురవుతున్నదని, అతడితో ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రమేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

రామగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మంథని మండలం సిద్దపల్లి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మట్టికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పాటు డ్రైవర్లను విచారించగా కల్వచర్లకు చెందిన టిప్పర్ యజమాని ఆదేశాల మేరకు మంథని మండలం గుంజపడుగులోని సరస్వతి పంప్‌హౌజ్ దగ్గర నుంచి రాఘవపూర్‌లోని ఇటిక బట్టీలకు తరలిస్తున్నామని తెలిపారన్నారు. ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూ వివాదంలో మహిళా రైతు దారుణ హత్య



మల్లవ్వ (ఫైల్)

చందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ (60) అనేమహిళా రైతు సోమవారం సాయంత్రం హత్యకు గురైంది. మృతురాలి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, పోలీసులకథనంప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ, బొల్లు మనోజ్ అనే యువకుడి మధ్య కొన్నిసంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోంది. ఈ విషయంలో పలు మార్లు పంచాయతీలు జరిగాయి. మల్లవ్వ తనకు ప్రాణభయం ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు. మల్లవ్వ సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా మనోజ్ కత్తితో మల్లవ్వను హత్యచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటుదూరంలో పెద్దమ్మ ఆలయంవద్ద మల్లవ్వను అత్యంత దారుణంగా హత్యచేశాడు. అనంతరం హంతకుడు మనోజ్ కత్తితో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సమాచారం తెలుసుకున్న చందుర్తి ఎస్ఐ అంజయ్య సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త రాజయ్య ఉన్నాడు. కుమారుడు రాజు గల్ఫ్‌లో ఉండగా, ఒక కూతురు ఉన్నారు. మల్లవ్వ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

- కుటుంబ సభ్యుల రాస్తారోకో

మల్లవ్వ మృతదేహాన్ని తమకు తెలియకుండా పోలీసులు పోస్టుమార్టంకు పంపించారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో కోరుట్ల-వేములవాడ ప్రధానరహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. తమకు న్యాయంచేయాలని నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. న్యాయంచేస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి ధర్నాను విరమించారు.

పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

బొల్లు మల్లవ్వను హత్య చేసింది తానేనని చందుర్తి గ్రామానికి చెందిన యువకుడు బొల్లు మనోజ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కత్తిని పోలీసుల ఎదుట ఉంచి, మహిళ తల తీసివేసినట్టు, పెద్దమ్మ గుడి వద్ద హత్య చేసినట్టు పోలీసులకు చెప్పాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇదిలా ఉండగా మనోజ్ గతంలో ఒక వ్యక్తిని చందుర్తి గ్రామంలో వినాయక చవితి రోజున హత్య చేశాడు. ఆ సమయంలో మైనర్‌గా ఉండడంతో పోలీసులు జువైనల్ జైలుకు తరలించారు. ఆ కేసులో జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదలై వచ్చాడు. ఈ ఘటన ఒక్కసారిగా మండలంలో కలకలం సృష్టించింది.

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీ క్షల్లో మాల్‌ప్రాక్టీస్ చేసిన 16మంది విద్యా ర్థులను సోమవారం డీబార్ చేసినట్లు విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. కరీంనగర్ శ్రీచైతన్యడిగ్రీకళాశాల కేంద్రంలో ఇద్దరు, వాణినికేతన్‌లో ఒకరు, అపూర్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్(మహిళా) డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శివానీ డిగ్రీకళాశాలలో ఇద్దరు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇద్దరు, గంభీ రావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ అప్పులకు యువకుడు బలి

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ అప్పులకు ఓ యువకుడు బలి అయ్యాడు. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పప్పు ఆంజనేయులు(25) లోన్ ఆప్‌లో ఒక లక్ష అప్పు చేశాడు. వడ్డీతో పాటు రెండు లక్షల లోన్ చెల్లించాడు. అయినా మరో రెండు లక్షల రూపాయలు చెల్లించాలని యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం గ్రామంలోని గుట్టవద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



ప్రసన్నకుమార్ (ఫైల్)

తంగళ్లపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు చేరాల ప్రసన్నకుమార్ (27) హైదరాబాదులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపినవివరాల ప్రకారం... తంగళ్లపల్లికి చెందిన చేరాల రాజేశం- సుగుణ దంపతుల కుమారుడు ప్రసన్న కుమార్ బీ ఫార్మసీ పూర్తిచేసుకుని హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రభుత్వం ఫార్మసిస్ట్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయగా ప్రసన్నకుమార్ పరీక్ష రాశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆందోళనకు లోనయ్యాడు. అలాగే గతంలో కూడా పలు ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాసినప్పటికీ ఎంపిక కాకపోవడంతో మానసిక వేదనకు గురయ్యాడని బంధువులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులోని కోఠిలో మరో నలుగురితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఉదయం బాత్‌రూంలో ఉరివేసుకొని ప్రసన్నకుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన మిత్రులు ఉద్యోగాలకు ఎంపికవుతుండగా తనకు మాత్రం ఉద్యోగం రావడంలేదని ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడు మృతి



రవిందర్(ఫైల్)

గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండలవర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవిందర్(51) సోమవారం మృతి చెందాడు. ఈ నెల 17న రవిందర్ బైక్‌పై వేములవాడకు బయలుదేరగా కొదురుపాక, నాంపల్లి మధ్యలో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో పక్కటెములు విరిగి తలకు తీవ్రంగా గాయాలు కాగా స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం రవిందర్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మొలకెత్తిన ధాన్యంతో రైతుల నిరసన



మొలకెత్తిన ధాన్యంతో నిరసన తెలుపుతున్న రైతులు

చందుర్తి మే 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మం డల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుక పెంటయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మొలకెత్తిన ధాన్యంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చందుర్తి రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని, వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాకులను పలుమార్లు కోరినప్పటికీ నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మార్త వెంకవ్వ, సతీష్, తిరుపతి, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

వీణవంక, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో సోమవారం గొల్ల, కురుమలు, మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్లనడుమ ఆలయానికి తరలివచ్చి స్వామివారికి మొక్కులుచెల్లించుకున్నారు. అనంతరం కామరతి, బీరప్ప కల్యాణోత్సవం కన్నుల పండువగ చేశారు.



బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

కారు బోల్తా: ముగ్గురికి స్వల్ప గాయాలు

పెద్దపల్లి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో పెద్దకల్వల శివారువద్ద మూడుకార్లు ఒక దానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా పెద్దపల్లిఆసుపత్రికి తరలిం చారు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం కరీంన గర్‌కు చెందిన కుటుంబ సభ్యులు కాళేశ్వరం సరస్వతి పుష్కరస్నానాలకు వెళ్లి తిరిగి వెళ్తున్న క్రమంలో పెద్దక ల్వల శివారులోని రాజీవ్‌రహదారికి ఆనుకొని ఉన్న మహబూబ గార్డెన్ ఎదుట మూడు కార్లు ఢీకొన్నాయి. కరీంనగర్ చెందినవారి కారు బోల్తాపడింది. గాయా లైనవారిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



బోల్తా పడ్డ కారు

మాచారెడ్డిలో రోడ్డు ప్రమాదం

- రాజన్నపేట మహిళ దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన మహిళ చొక్కి సులోచన(28) అక్కడికక్కడే దుర్మరణం పాలైందని స్థానికులు, కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు. ఆమె పిల్లలు అఖిలేష్, శివాన్స్‌లు తీవ్ర గాయాలకు గురయ్యారు. తల్లి మృతి చెందడం, ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలపాలడంతో స్థానికంగా విషాదం నెలకొంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని సులోచన భర్త మహేందర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఉదయం ఆమె తన పిల్లలను తీసుకుని మాచారెడ్డి మండలం లచ్చపేటకు బస్సులో బయలుదేరింది. మాచారెడ్డిలో దిగిన ఆమె తన తండ్రికి ఫోన్ చేసి తీసుకెళ్లాలని పేర్కొంది. తండ్రి టీవీఎస్ ఎక్సల్‌పై చేరుకుని సులోచన, ఇద్దరు పిల్లలు అఖిలేష్, శివాన్స్‌లతో కలిసి లచ్చపేటకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. దాంతో సులోచన అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్ర గాయాలపాలైన పిల్లలను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాజామాజీసర్పంచ్ శంకర్, కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పుట్టింటికి వెళుతున్నానని బయలుదేరిన మహిళ సులోచన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

భక్తులతో కిక్కిరిసిన రాజన్నక్షేత్రం

- రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- దర్శనానికి నాలుగు గంటల సమయం



భక్తులతో పోటెత్తిన రాజన్న ఆలయ ప్రాంగణం



ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. వేసవి సెలవుల సందర్భంగా రాజన్న ఆలయం భక్తులతో రద్దీగా ఉంటోంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు శనివారం రాత్రి ఆలయా నికి చేరుకుని ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటలు క్యూలైన్‌లో బారులుతీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా భక్తుల రద్దీ దృష్ట్యా బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లు నిరంతరంగా కొనసాగించారు. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. భీమేశ్వర, నగరేశ్వర శ్రీబద్దిపోచమ్మ ఆలయాలను సందర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం రోజున రాజన్న ఆలయానికి 80నుంచి 90వేల వరకు భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

- భక్తుల ఇబ్బందులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల వద్ద కొందరు డబ్బులు దండుకునే యత్నం చేస్తున్నారు. బెల్లం దుకాణాల వద్ద కాంటాల్లో వ్యత్యాసం వస్తుందని భక్తులు సదరు కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. బెల్లం రాజన్న ఆలయ పేరుతో ముద్రించిన టికెట్స్ ఇస్తూ భక్తుల వద్ద అందినకాడికి దండుకుంటు న్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

అంతేకాకుండా కొబ్బరికాయ కొట్టిన చోట ఒక్కో కొబ్బరికాయకు రూ.10వసూలు చేస్తున్నారు. కొబ్బరి కాయలు కొట్టే కాంట్రాక్టర్ సదరు సిబ్బందికి వేతనం ఇవ్వకుండా భక్తుల వద్ద తీసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై భక్తులు ఆలయాధికారులపై తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈవోతోపాటుగా సంబంధిత ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షించి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాల అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణనగర్‌లో ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వారివద్ద నగదుతో పాటు ఏడుసెల్‌ఫోన్లు పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో కానిస్టేబుళ్లు కమలాకర్, అఫ్రోజ్, ఖాసీం తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

మానకొండూర్‌లో ఐదుగురు..

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లి గ్రామంలో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,460 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీఐ గోపతి నరేందర్ తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కళ్యాణ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్, 250చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు కాలేదని, ఉద్యమకారులకు బస్‌పాస్, గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అనుముల కళావతి, జనగామ స్వామి, దాసరి ఎల్లయ్య, బత్తుల శంకర్, సీత, లలిత, మొగిలి, రాములు పాల్గొన్నారు.



చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో రాణించిన మేఘన

● అభినందించిన పోలీస్ కమిషనర్



మేఘనను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పిస్టల్ షూటింగ్ పోటీల్లో రామగుండానికి చెందిన మేఘన రాణించింది. ఏసీపీ సాదుల సారం గపాణి కుమార్తె మేఘన పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది. సోమవారం రామ గుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆమె సన్మానించారు. పెద్దపల్లి ఏసీపీగా విధులు నిర్వహించిన సారంగపాణి ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె మేఘన కొన్ని సంవత్సరాలుగా షూటింగ్‌లో రాణిస్తోంది. ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్-2023 జర్మనీలో జరుగగా బంగారుపతకం, ఆసియా చాంపియన్‌షిప్-2023లో వెండిపతకం, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్- 2023లో దేశానికి ప్రాతినిధ్యం వహించారు. మూడు అంతర్జా తీయ చాంపియన్ షిప్ పత కాలు, బహుళ తెలంగాణ రాష్ట్ర చాంపియన్‌షిప్ పతకాలతో పాటు వ్యక్తిగత కాంస్య, ఆల్ ఇండియా పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించారు. విలువిద్య లో సైతం జాతీయ స్థాయిలో సత్తాచాటారు. సీపీ మాట్లా డుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల్లోఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహిం చాలని, ముఖ్యంగా నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసులు పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు సహకారం అందించడం సంతోషదాయమకమన్నారు. మేఘన అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

ముగిసిన సరస్వతి పుష్కరాలు



సరస్వతి విగ్రహం వద్ద మంత్రి శ్రీధర్‌బాబు, తదితరులు



కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



శివుని ప్రతిమ వద్ద భక్తుల కోలాహలం



హారతిని తిలకిస్తున్న భక్తులు



హారతినిస్తున్న కాశీ పండితులు



● చివరి రోజు 2.25 లక్షల మంది పుణ్యస్నానాలు

● మొత్తంగా 15.90 లక్షల మంది భక్తుల రాక


భూపాలపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలు సోమవారంతో ముగిశాయి. భూపాల పల్లి జిల్లా కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రోజూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పుష్కరాలను విజ యవంతం చేసింది. చిన్నచిన్న అవాంతరాలు మినహా యిస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసు కోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పుష్కరాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పా ట్లను ఘనంగా చేసింది. ఈ పుష్కరాలకు 15.9 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. చివరి మూడు రోజుల్లోనే సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో చివరి రోజైన సోమవారం 2.25 లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

● **ట్రాఫిక్ సమస్యలు**

పుష్కరాలకు ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల మంది వస్తారని అంచనా వేయగా ఎవరూ ఊహిం చని రీతిలో సంఖ్య 16 లక్షలకు చేరుకోవడంతో అధి కారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భక్తుల సంఖ్య ఊహించని రీతిలో ఉండడంతో సదుపాయలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సరిగ్గా లేకపోవడంతో పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు.

● **వైభవంగా త్రివేణిసంగమ నవరత్నమాల హారతి**

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఏడు నుంచి 7.45గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు విజయవంతం కావడం, 12రోజుల పాటు ప్రజలందరికీ శ్రేయస్సును, శుభాన్ని కల్గించాలని నదీమాతకు నవరత్నమాలహారతి సమర్పించడం ఆనందకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాసరాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్‌మోహన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ పాల్గొన్నారు.



పదేళ్లలో దోచుకున్న ప్రతీ రూపాయి కక్కిస్తాం

● కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లపాలనలో దోచుకున్న ప్రతీ రూపాయిని రాష్ట్రప్రభుత్వం కక్కిస్తుందని కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు, కుల సంఘాల జేఏసీచైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. సోమ వారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేక రుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు అవి నీతిపై విచారణ పూర్తికావచ్చిందని, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఆ భయంతోనే సీఎం రేవంత్ రెడ్డిపైనా, కాంగ్రెస్ ప్రభుత్వంపైనా మాజీమంత్రి కేటీఆర్ అడ్డగోలు వ్యాఖ్యలు చేశారన్నారు. తెలంగాణ బీఆర్ఎస్‌ది కాదని, 4కోట్ల తెలంగాణ ప్రజల దని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ.70వేల కోట్ల నుంచి రూ.లక్షా50వేల కోట్లకు పెంచుకున్నారని, రూ.80వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో ఇసుకదోపిడీలో కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు భాగస్వాము లయ్యారని ఆరోపించారు. 2014కు ముందు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఆస్తులు సాధా రణ స్థితిలో ఉంటే ఇప్పుడు వేలకోట్లకు చేరాయన్నారు. కేటీఆర్, హరీష్‌రావు విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని, అవి తెలంగాణాను దోచుకున్న డబ్బులేనని అన్నారు. ఆస్తుల విషయం లోనే ఎమ్మెల్సీ కవితకు కేటీఆర్‌కు మధ్య గొడవలు తలెత్తాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ప్రజలను, ఉద్యమ కారులను మోసం చేశారని, చివరకు ఆడ బిడ్డ కవితను కూడా ఇంటినుంచి బయటకు గెంటేస్తున్నారని అన్నారు. తండ్రీకొడుకుల వ్యవహారంతో బీఆర్ఎస్ మూడు ముక్కలవు తుందని, హరీష్‌రావు బీజేపీలోకి వెళ్తారని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం

విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాదబీమా

● దేశచరిత్రలోనే రికార్డు

● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రమాదబీమా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కరీంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కరీంనగర్ సర్కిల్ చెంజర్ల సెక్షన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ భార్య సుష్మకు సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుడికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వమూ ఇంత గొప్పగా ఆలోచన చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే సాధ్యమైందని అన్నారు. ప్రమాద బీమాతోపాటు, కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు అద్దం పడుతుందన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అంది ంచాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, బ్యాంకు ఉన్నతాధికారులు సర్వేశ్ రంజన్, కె.భాస్కర్ రావు, డి.అపర్ణ రెడ్డి, కరీంనగర్ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు, డీఈ తిరుపతి, ఏఈ రమేష్, లక్ష్మణమూర్తి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

● ప్రమాదకరంగా గుంతలు ● వాహనదారుల ఇబ్బందులు



వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు



నగునూర్ మూల మలుపు వద్ద గుంతలు పడిన రోడ్డు

కరీంనగర్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి లక్సెట్టిపేటకు వెళ్లే మార్గంలో నగర శివారులోని వల్లంపహాడ్ బ్రిడ్జి సమీ పంలో రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాదారులు రాకపోక పోలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు కరీంనగర్ నుంచి మంచిర్యాల, ఆసిఫాబాద్ వైపు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రహదారి వెంట కరీంనగర్‌కు వచ్చి వెళ్తుంటారు. వల్లంప హాడ్ బ్రిడ్జిపైనా, నగునూర్ నుంచి నుంచి కరీంనగర్‌కు వచ్చే రహదారి మూల మలుపు వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిసి గుంతల్లో నీరు నిలవడంతో వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు రోజుల కిందట ఈ గుంతల్లో నీరు నిలిచి మూడు ప్రమాదాలు సంభవించాయి. రాత్రి వేళ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వల్లంపహాడ్ బ్రిడ్జిపై గుంతలతోపాటు, మూల మలుపుల వద్ద గుంతలకు మరమ్మతు చేపట్టాలని కోరుతన్నారు.

విద్యుత్ కోసం గేదెలతో రోడ్డుపై నిరసన



రోడ్డుపైన అడ్డంగా గేదెలను కట్టేసి నిరసన తెలుపుతున్న బాధితులు

గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా వ్యవసాయబావికి విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో పశువులు నీళ్ల లేక అల్లాడుతున్నాయని కరీంనగర్‌జిల్లా గన్నేరువరం మండలం లోని గునుకుల కొండాపూర్‌కు చెందిన రైతు కొరివి పోచయ్య-సుశీల దంపతులు తమ గేదెలతో రోడ్డుపైన బైఠాయించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గును కుల కొండాపూర్ నుంచి గుండ్లపల్లికి వెళ్ళే ప్రధాన రహదారిపై నెల రోజులు క్రితం ఓ లారీ తగిలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయన్నారు. విద్యుత్ అధికారులు అక్కడికి వైర్లను తొలగించారని, అప్పటినుండి తన వ్యవసాయ బావికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. విద్యుత్ నిలిచిపోవడంతో మోటర్ నడవడం లేదని, పశువులకు నీళ్ల పెట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యం పట్టించుకోలేదన్నారు. దీంతో రోడ్డుపై గేదెలతో నిరసనకు దిగినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి వచ్చి రైతు దంపతులకు నచ్చజెప్పి గేదెలను తీసివే యించారు. అనంతరం వారి బావికి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ



యమధర్మరాజుకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, మే 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలా డాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్థానిక శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి బిల్వార్చన చేశారు. స్వామివారలకు ఆలయవేద పండి తులు బొజ్జ రమేష్‌శర్మ నిత్యపూజలు, అభిషే కాది కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీ నర సింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **రాష్ట్ర దేవాదాయ మాజీ కమిషనర్ పూజలు**

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాజీకమిషనర్ సుందర్‌కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద వారికి వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారందరు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లక్ష్మీ నరసింహస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

● సంక్షిప్తంగా..

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

భగత్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయ పనులు ప్రారంభమైనా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడంలో వ్యవసాయశాఖ విఫలమైందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా బొడ్డు రాజు

కరీంనగర్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ లీగల్‌సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా బొడ్డు రాజును నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డు రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు, తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, లీగల్ సెల్ స్టేట్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రచయిత్రి సుజనాదేవికి సమీక్షా పోటీల్లో బహుమతి

కరీంనగర్ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన రచయిత్రి నామని సుజనాదేవికి తెలుగు రాష్ట్రాల స్థాయి సాహితీ సమీక్షా పోటీల్లో తృతీయ బహుమతి లభించింది. అయినం పూడి శ్రీలక్ష్మి కేన్సర్ అంశంపై రాసిన మోనోలాగ్ ఆఫ్ ఏ ఉండెడ్ హార్ట్ కవితపై పోటీ నిర్వహించారు. ఆదివారం రవీంద్ర భారతిలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, ఐఏఎస్ అధికారి శ్రీజన, మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, సాహితీవేత్త శ్రీలక్ష్మి అవార్డు అందజేశారు.

రచనలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి వెలువడే సాహిత్య పత్రిక 'పునాస'లో ప్రచురణ కోసం కవులు, రచయితలు, అనువాదకులు తమ కవితలు, విమర్శ, సాహిత్య వ్యాసాలు, కథలు, అనువాద కవితలు పంపాలని సాహిత్య అకాడమీ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు. జూన్ 15లోగా 9063131999 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కరువు

- పని చేయని పైప్‌లైన్, వెలగని విద్యుద్దీపాలు
- అంత్యక్రియలకు ఇబ్బందులు
- పట్టించుకోని బల్దియా అధికారులు


దుర్శేడ్‌లోని శ్మశాన వాటిక

కరీంనగర్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో అంతిమసంస్కారాలకు హాజరయ్యే గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్శేడ్ గతంలో గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉండేది. పంచాయతీ ఆధ్వర్యంలో కనీస సౌకర్యాలు కల్పించారు. ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైంది. అప్పటి నుంచి సౌకర్యాల కల్పనపై బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పని చేయడం లేదని, విద్యుద్దీపాలు వెలగడం లేదని పేర్కొంటున్నారు. రాత్రి వేళ వాహనాల వెలుతురులో అంతిమ సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. శ్మశాన వాటిక పిచ్చిమొక్కలతో నిండిపోయిందని, ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించాలని, సౌకర్యాలు మెరుగు పర్చాలని కోరుతున్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

- సుంకిశాల సంపత్ రావు, మాజీ ఉప సర్పంచ్

దుర్శేడ్ గ్రామాన్ని పేరుకే నగరపాలక సంస్థలో విలీనం చేశారు. శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విలీన గ్రామాలకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులను కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలి.

ఇన్‌చార్జి మంత్రి ఉన్నట్టా.. లేనట్టా..?

(5వ పేజీ తరువాయి)

అసహనాన్ని కలిగించింది. వీరందరికి శ్రీధర్‌బాబు అండగా ఉన్నారనే అభిప్రాయం పొన్నం వర్గంలో పాతుకునిపోయింది. శ్రీధర్‌బాబు వర్గీయులు దానిని కొట్టి పారేస్తున్నారు. శ్రీధర్‌బాబు అడపాదడపా ఇక్కడి కార్యక్రమాలకు వస్తున్నా ఇద్దరి మధ్య ఏమాత్రం సయోధ్య ఉండడం లేదు. ఈ ఇద్దరి మంత్రుల వ్యవహారాన్ని ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తలనొప్పిగా భావిస్తున్నారని పార్టీ నేతలు అంటున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ పలు వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్ వేటు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆయన తన పరిస్థితి ఏమిటో పార్టీ స్పష్టం చేయాలని, సస్పెన్షన్ ఎత్తివేస్తుందా లేదా తేల్చాలని పట్టుబడుతున్నారు.

● **ఏర్పాటు కాని ఇందిరమ్మ కమిటీలు**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాలేదు. ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి వాటి ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్ ఇన్‌చార్జి మంత్రికి పంపి ఆమోదం పొందితేనే నియోజకవర్గంలో ప్రజలకు ఇళ్ల మంజూరు పత్రాలు అందుతాయి. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ప్రజలకు అందిస్తున్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఎప్పుడు మంజూరి ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. జిల్లాకు వస్తే ఈ పరిస్థితులన్నింటికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని, అందుకే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతోంది

హెలీప్యాడ్ పార్కును పునరుద్ధరించాలి

సుభాష్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలో హెలీప్యాడ్ పార్కును పునరుద్ధరించాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కోరారు. సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999లో అప్పటి కలెక్టర్ దేవబ్రతకంత కలెక్టరేట్‌లో హెలీప్యాడ్ పార్కును ఏర్పాటు చేశారని, 2005లో సెంచరీ సెలబ్రేషన్స్‌లో భాగంగా సెంచరీ పార్కుగా నామకరణం చేశారని తెలిపారు. 2021లో నూతన కలెక్టరేట్ నిర్మాణంలో భాగంగా పార్కును మూసివేశారని తెలిపారు. సర్కస్ గ్రౌండ్ (జ్యోతి బాపూలే), మల్టీపర్పస్ పార్కులలో వాకింగ్ చేయడానికి అనుమతించడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 బీ-ఆర్క్, బీ-ప్లానింగ్ ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీ ప్లానింగ్‌లో బి.హితేష్ 152, డి.మహేష్ 227, బి.రేణుక 393, ఎ.శరణ్యానందిని 737, ఎం.నిఖిత్ నాయక్ 1031, వి.లత 1092, జి.అజయ్ 1115, ఆర్.ఐశ్వర్య 1272, ఎం.అంజనశ్రీ 1388వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. బీ ఆర్క్‌లో బి.హితేష్ 718, డి.మహేష్ 756, బి.రేణుక 1208, ఆర్.ఐశ్వర్య 1877, ఎ.శరణ్యానందిని 1885వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

బ్లూబెల్స్‌లో ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

కరీంనగర్ టౌన్/కరీంనగర్ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో గత నెల 24 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ శిక్షణలో 120 మంది పిల్లలకు కరాటే, అబాకస్, హ్యాండ్ రైటింగ్, డ్యాన్స్, భగవద్గీత శ్లోకాలు, ట్రెడిషనల్ గేమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని జంగ సునీతా మనోహర్‌రెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నేషనల్ పైలెట్ డే



కేకు కట్‌చేస్తున్న 108 వాహనాల పైలెట్లు

సుభాష్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో సోమవారం నేషనల్ పైలెట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీకే ఈఎంఆర్ఐ 108 అత్యవసర సర్వీసులో పని చేసే ఉద్యోగులు పైలెట్ డే సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ ఇమ్రాన్, పైలెట్లు ఖాజా ఖలీల్, రవి, సదానందం, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నంబులాద్రి స్వామి ఆలయంలో సుదర్శన హోమం

సుల్తానాబాద్, మే 26: (ఆంధ్రజ్యోతి): దేవునిపల్లి గ్రామంలోని లక్ష్మీ నంబులాద్రి స్వామి ఆలయంలో సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం సుదర్శన హోమంతోపాటు నంబులాద్రి స్వామికి పూజలు నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు. హోమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, ఆలయ మాజీ చైర్మన్ స్వరూప, కేడీసీసీబీ డైరెక్టర్ దేవరనేని మోహన్ రావు, రైతు బంధు జిల్లా మాజీ అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను తరలించవద్దు

సుభాష్‌నగర్, మే 26(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లను ప్రాథమిక పాఠశాలల వద్దకు తరలించవద్దని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, అంగన్‌వాడీ టీచర్స్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రజిత డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు అనుబంధంగా పరిమిత సంఖ్యలోనే అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని, దానికి మూడు రెట్లు సెంటర్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. వసతులు లేని చోట గర్భిణులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. సెంటర్లకు పక్కా భవనాలు నిర్మిస్తామన్న ప్రభుత్వం హామీని నిలబెట్టుకోలేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.18వేల వేతనం హామీ విస్మరించిందన్నారు. కనీసం అద్దెబకాయిలు, ఇతర అలవెన్సులు ఇవ్వడం లేదని వాపోయారు. జిల్లాలో శుక్రవారం సభతో అంగన్‌వాడీ టీచర్లపై ఆర్థికభారం పడుతోందని, ఫ్రీస్కూలు కుంటుపడుతోందని, భారం తగ్గించాలని అన్నారు. నెలకు నాలుగుసార్లు కాకుండా ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న, అధ్యక్షురాలు రజిత, విజయ, పద్మ, సంధ్య పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను మూసివేయాలి

కరీంనగర్ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాపులను మూసివేయాలని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. రెండు మండలాల్లోని బెల్ట్‌షాపుల నిర్వాహకులకు సోమవారం కరీంనగర్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. బెల్టుషాపులు 24 గంటలు నిర్వహిస్తుండడంతో యువత చెడువ్యసనాలకు అలవాటుపడుతున్నారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. చదువుపై దృష్టిసారించకుండా చిన్న వయస్సులోనే భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, కరీంనగర్ రూరల్ ఎస్సై పి.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి హేయమైన చర్య

కరీంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టాలని సోమవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన తోపులాటలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి హేయమైన చర్యని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు గిచ్చి కయ్యం పెట్టుకున్నారన్నారు. సిరిసిల్లలో ఉన్న కేటీఆర్ క్యాంపు ఆఫీస్ ఎమ్మెల్యే కార్యాలయం కాదని, అది కేవలం ఎమ్మెల్యే కోసం నిర్మించుకున్న గృహమేనని అన్నారు. శాసనసభ్యులు నిర్మించుకున్న ఇంటిలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో ఎలా పెడతారని ప్రశ్నించారు.

గంగాధర: సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి అమానుషమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం గంగాధరలో మాట్లాడారు. ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కరీంనగర్ టౌన్: సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చేసే ప్రతీ తప్పును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని అన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

సుభాష్‌నగర్, మే 26(ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణను అరికట్టాలని గోరక్ష రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి కోరారు. సోమవారం ప్రజావాణిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులను అక్రమ రవాణా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, నాగరాజు, వీహెచ్‌పీ కార్యదర్శి తోట రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: బక్రీద్ సందర్భంగా గోవులను తరలించే అవకాశం ఉందని గోవులను వధించేవారిపై, క్రయవిక్రయాలు జరిపే వారిపై నిఘా ఉంచాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణుప్రసాద్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

సర్పంచుల బిల్లులపై ప్రభుత్వ అసత్య ప్రచారం

● **సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజం**


మాట్లాడుతున్న సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం

గంగాధర, మే 26 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల బిల్లులు విడుదల చేశామంటూ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగులక్ష్మీరాజం అన్నారు. సోమవారం ఆయన గంగాధరలో మాట్లాడారు. జిల్లాలో రెండు వేల ఎస్‌డీఎఫ్ చెక్కులు పెండింగ్‌లో ఉంటే కేవలం తొమ్మిది చెక్కులు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. బిల్లులు విడుదల చేశామని ప్రభుత్వం ప్రకటనలు చేయడంతో అప్పులవారు ఇంటికివచ్చి అప్పు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, ఎండీ నజీర్‌హుస్సేన్, శ్రీమల్ల మేఘరాజు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు: ఎమ్మెల్యే సత్యం



చొప్పదండిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, మే 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిపేద కుటుంబానికి ఇందిరమ్మఇళ్లను ఇస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం చొప్పదండిలో 700మంది ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరుపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడి చిరకాల స్వప్నమైన సొంతింటి నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో గూడులేని పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత తమదేనని అన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు కొలిమికుంట, చొప్పదండిలో బోర్‌మోటార్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కు అందజేత..

గంగాధర: గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన బాధిత రైతుకు సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెక్కును అందించారు. గ్రామానికి చెందిన వీరమల్లయ్యకు చెందిన జోడెద్దులు ఇటీవల పిడుగుపాటుకు గురై మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం గ్రామానికి వెళ్లి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని తహసీల్దార్ అనుపమను ఆదేశించారు.దీంతో ప్రభుత్వం రూ.64వేల నష్టపరిహారం మంజూరు చేసింది.

సంఘ భవనానికి నిధులు కేటాయించాలి..

రామడుగు: రామడుగు మండలం వెదిర గ్రామ శ్రీవినాయకరెడ్డి సంక్షేమసంఘం నాయకులు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిశారు. ఈ సందర్భంగా వారు సంఘం భవననిర్మాణ పనుల కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

సీపీఐ మండల కార్యదర్శిగా రత్నాకర్


రత్నాకర్

ఇల్లందకుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టుపార్టీ(సీపీఐ) మండలకార్యదర్శిగా మాధరపు రత్నాకర్‌ను నియమించినట్లు జిల్లాకార్యదర్శి మర్రివెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం జరిగిన మండల మహాసభలో ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ పార్టీ సూచించిన పనిని అంకిత భావంతో పనిచేస్తానని, ప్రజా సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తానని చెప్పారు.

ప్రభుత్వ పథకాలు యువత భవితకు ధీమా

● **సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి**


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

తిమ్మాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు యువత భవితకు ధీమా కల్పిస్తాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్ఎండీ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు నరేందర్‌రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

జమ్మికుంట రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని కొత్తపల్లిలోని తినుబండారాల తయారీకేంద్రాన్ని సోమవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీచేశారు. జమ్మికుంటలోని కొత్తపల్లిలో 25 సంవత్సరాల నుంచి కిరణాషాపులలో దొరికే చిన్న పిల్లలు తినే లడ్డూలు, చేగోడి, కారా, రసగుల్లా లాంటి తినుబండారాలు ఇక్కడ తయారుచేస్తున్నారు. ఈ తయారీకేంద్రంపై ఫిర్యాదురాగా జిల్లాఫుడ్‌సేఫ్టీ అధికారి అంకిత్‌రెడ్డి తన బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరిశ్రమకు రిజిస్ట్రేషన్ ఉందికానీ లైసెన్స్‌లేదన్నారు.ఈ సందర్భంగా వారు కొన్ని పదార్థాలను తమవెంట తీసుకెళ్లారు. వాటిని పరీక్షించి అనంతరం పరిశ్రమ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


మృతి చెందిన గేదె

హుజూరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోచమ్మ దేవాలయసమీపంలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. పట్టణంలోని గొల్లవాడకు చెందిన సింగరవేణి శ్రీనివాస్ తన పాడి గేదెను మేతకోసం గుండ్ల చెరువు వద్ద కట్టేశాడు. గేదె మేతమేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలగా విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఏఐఎఫ్‌డీఎస్ ఉమ్మడిజిల్లా ఉపాధ్యక్షుడిగా విష్ణు

హుజూరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) ఉమ్మడిజిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తులవిష్ణు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

శంకరపట్నం/గన్నేరువరం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలాల్లోని సహకారసంఘాల పరిధిలో 50శాతం రాయితీపై జీలుగవిత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారులు వెంకటేష్, కిరణ్మయి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఏఈవోలను సంప్రదించి పర్మిట్ తీసుకొని, కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

రాజీవ్ యువ వికాసానికి 4,598 దరఖాస్తులు

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల సిబిల్ వెరిఫికేషన్ మండలంలోని వివిధ బ్యాంకులలో కొనసాగుతోంది. మానకొండూర్ మండలంలో 29గ్రామపంచాయితీలుండగా మొత్తం 4598 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. మండలానికి 951యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. గతంలో లబ్ధిపొందిన వారితోపాటు సక్రమంగా చెల్లించని వారిని తొలగించి మండలానికి కేటాయించిన 951మందిని ఎంపిక చేసి జూన్2న లబ్ధిదారులకు ఎంపిక పత్రాలను అందజేయనున్నారు.

బీజేపీ తిరంగా ర్యాలీ

మానకొండూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మానకొండూర్‌లో తిరంగా ర్యాలీని నిర్వహించారు. పహల్గాం దాడికి ప్రతిచర్యగా ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ముష్కరులను హతమార్చిన వీరజవాన్ల విజయోత్సవాన్ని హర్షిస్తూ జాతీయ జెండాతో దేశసైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ తిరుపతి, కే రాజిరెడ్డి, రాపాక ప్రవీణ్, కే ప్రవీణ్, ఎం కోటేశ్వర్, ఎన్ బలరాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో బోర్ల ఏర్పాటు

శంకరపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాపూర్, కరీంపేట గ్రామాల్లో ఎంపీనిధులతో తాగునీటి అవసరాల కోసం సోమవారం బోర్లు వేశారు. ఈ సందర్భంగా బీజేపీనాయకులు మాట్లాడుతూ ప్రజాఅవసరాల నిమిత్తం కోరగానే స్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి చేస్తున్నాం

శంకరపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని మాజీజడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పరిపాలన పారదర్శకంగా జరుగుతుందన్నారు.